# అమెరికాలో వర్ణవివక్ష, శ్వేత జాత్యహంకారం!

# బట్టబయలైన పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం!!

**ప్రపంచదేశాల** స్వేచ్ఛకీ, స్వాతంత్ర్యానికీ ప్రజాస్వామిక పరిరక్షణకూ తమ దేశమే మూల విరాట్టు అని విర్రవీగుతున్న పెట్టుబడిదారీ అమెరికా దేశ పాలనలో, నల్లజాతి ప్రజల జీవితాలు ఎంత అమానుషంగా సాగుతున్నాయో జార్జిఫ్లాయిడ్ హత్యోదంతం బట్టబయలుచేసింది. 400 ఏళ్ళ క్రితం అమెరికాలో మొదలయిన బహిరంగ బానిసత్వాన్ని, అబ్రహాంలింకన్ ఆ దేశాధ్యక్షుడుగా వుండగా 160 ఏళ్ళక్రితం (1863) చట్టబద్ధంగా నిషేధించారు. కానీ ఆఫ్రికా ఖండంనుండి జంతువులలాగా వేటాడి తెచ్చిన నల్లజాతి ప్రజలను నేటికీ సమస్త జీవన రంగాలలో వర్ణవివక్షతో, తెల్లజాతి దుర హంకారంతో రెండవశ్రేణి పౌరులుగా వ్యవహ రించటం ఆచరణలో సర్వసాధారణంగా సాగుతూ వుందనటానికి ప్రత్యక్ష ఉదాహరణే 25-5-2020 నాడు తెల్లజాతి పోలీసు, నల్లజాతి పౌరుడయిన జార్జిఫ్లాయిడ్‌ను చేసిన హత్య!

46 ఏళ్ళ జార్జిఫ్లాయిడ్ మిన్నియా పోలీస్ నగరంలో ఒక రెస్టారెంటులో గార్డుగా పని చేసేవాడు. కరోనా కారణంగా పని కోల్పోయిన వారిలో అతనొకడు. ఫ్యాన్సీ స్టోర్స్‌లో కొనుగోలు చేసిన వస్తువుకి ఫ్లాయిడ్ చెల్లించిన 20 డాలర్ల నోటు చెల్లనిదని స్టోర్స్ యజమాని పోలీసులకు ఫ్లాయిడ్‌పై ఫిర్యాదు చేయగా, పోలీసులొచ్చి ఫ్లాయిడ్‌ను అరెస్టు చేశారు. చేతికి సంకెళ్ళు వేయటాన్ని ప్రశ్నించినందుకు తెల్లపోలీసులు ఫ్లాయిడ్‌ను బొక్కబోర్లాపడేసి ఇద్దరు కదలకుండా చేయగా మరొక పోలీసు అతని మెడపై మోకాలితో బలంగా, నిర్దాక్షిణ్యంగా తొక్కి పట్టాడు. తనకు ఊపిరి ఆడటంలేదని ఎంత మొత్తుకున్నా కనికరం చూపకుండా 8 నిమిషాల 46 సెకండ్లు-ఫ్లాయిడ్ చనిపోయేవరకు-అలాగే, తన పక్కజేబులో దర్జాగా చేతులు పెట్టుకుని మరీ అదిమి పట్టాడు. ఆ సంఘటనకు మరికొందరు పోలీసులు కాపలా కాచారు. ఇదంతా నడిరోడ్డుమీద పట్టపగలే అందరూ చూస్తుండగానే జరిగింది. కొందరు (తెల్ల) మహిళలు, 'అయ్యో! పాపం!! చనిపోతాడు, మోకాలు తీసివేయమ'ని బతిమాలినా డెరిక్ చావిన్ అనే ఆ దురహంకార తెల్లపోలీసు కనికరం చూపలేదు. ఈ బహిరంగ హత్యాకాండ దృశ్యాన్ని ఫోనులో కొందరు చిత్రీకరిస్తున్నారని తెలిసినా లెక్కపెట్టకుండా ఫ్లాయిడ్ చనిపోయే వరకు ఆ దుష్టపోలీసు వదలలేదు. ఈ క్రూర హత్యోదంతం సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రసారం కావటంతో ప్రజలలో ముఖ్యంగా అమెరికాలోని నల్లజాతీయులలో ఇది తీవ్ర ఆగ్రహావేశాలను రగిలించింది. కోవిడ్- 19కి పాటించాల్సిన రక్షణ జాగ్రత్తలను కూడా పట్టించుకోకుండా ప్రజలు బజారుల్లోకి వచ్చారు. తమతమ రూపాలలో తీవ్ర ఆగ్రహావేశాలను ప్రదర్శించారు. కొన్నిచోట్ల పోలీసు వాహనాలను తగులబెట్టారు. షాపులను ధ్వంసం చేశారు. 40 నగరాలలో పోలీసు అధికారులు కర్ఫ్యూ విధించారు. 140కి పైగా అమెరికా నగరాలలో తీవ్ర ఆందోళనలు జరిగాయి. చాలా నగరాలలో పోలీసులేకాకుండా 'జాతీయ భద్రతాదళాల'ను (నేషనల్ గార్డ్స్‌ను) పిలిపించి అణచివేయాలని చూశారు. నిరసన ప్రదర్శనలు అమెరికాకే పరిమితం కాకుండా ఇంగ్లాండు, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాలలో కూడా పెద్దఎత్తున జరగటంవలన దానికి ప్రపంచ వ్యాపిత ఉద్యమ స్వభావం వచ్చింది.

అమెరికా దేశాధ్యక్షుడు నిరసనకారుల ఆగ్రహాన్ని చల్లార్చటానికికాక రెచ్చగొట్టటానికి ప్రయత్నించాడు. ఆందోళనకారులపై కాపలా కుక్కలను వదలాల్సి వస్తుందనీ, మిలిటరీతో అణచివేయాల్సి వుంటుందనీ హెచ్చరికలు జారీ చేశాడు. కొన్ని రాష్ట్రాల గవర్నర్లు ఆందోళనలను నిర్దాక్షిణ్యంగా అణచలేక పోతున్నారని విమర్శించాడు. ఆందోళనకారులు దోపిడీ దొంగల రూపంలో వున్న టెర్రరిస్టులని ఆరోపించాడు. 'లూటింగు ప్రారంభమైన వెంటనే షూటింగు (కాల్పులు) ప్రారంభమవుతుంద'ని పాత సినిమా డైలాగులతో బెదిరించాడు. అవన్నీ ఉద్యమకారులను రెచ్చగొట్టినట్టయింది. దానితో ప్రజాందోళన అమెరికా దేశాధ్యక్షుడు నివసించే 'వైట్‌హౌస్' మీదకు, రాజధాని నగరంపైకీ చేరింది. రాజభవనం సమీపంలోని వ్యాపార కేంద్రాలను ధ్వంసంచేయటం, తగలపెట్టటం... చివరికి రాజభవనం పైకి కూడా దాడిగా వెళ్ళటం జరిగింది. ఆ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంపు తన నివాస భవనం క్రిందవుండే రహస్య రక్షణ స్థావరమైన బంకర్ (నేలమాళిగ)లోకి వెళ్ళి దాక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. మొత్తం ఆందోళనకారుల వెనుక 'యాంటి ఫా' (ఫాసిస్టు వ్యతిరేక) అనే వామపక్ష టెర్రరిస్టు సంస్థ పనిచేస్తున్నదని ట్రంపు పదేపదే ఆరోపణలు చేశాడు. అయితే ఒకటి మాత్రం నిజం. అమెరికాలోనూ, ప్రపంచవ్యాపితంగా దేశదేశాల కమ్యూనిస్టులందరూ ఆర్థిక దోపిడీని, సాంఘిక పీడనలను, వర్ణవివక్షనూ వ్యతిరేకించే వారు కనుక, ఫ్లాయిడ్ హత్యకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు అన్నివిధాలా ముందుండి నడిపించే, మద్దతునిచ్చే, సంఘీ భావాన్ని అందించే కృషిలో నిమగ్నమయ్యా రన్నమాట మాత్రం నిజం!!

**అమెరికాలో నల్లవారిపై దోపిడీ, అణచివేతల చరిత్ర:**

సరిగ్గా 400 సంవత్సరాల క్రితం ఆఫ్రికా ఖండంనుండి జంతువులలాగా బంధించి తెచ్చిన ఆడ-మగ నల్లజాతీయులతో కూడిన మొదటి ఓడ అమెరికాలోని వర్జీనియా గడ్డకు వచ్చింది. ఐరోపా తెల్లవ్యాపారులు బానిస వ్యాపారంతో కోట్లు గడించారు. సుమారు 4 లక్షలమందిని అలా దౌర్జన్యంగా, క్రూర హింసాకాండతో అమెరికాకు తీసుకువచ్చారు. బానిసల జీవితం ఎంత దుర్భరంగా వుండేదో 'అంకుల్ టామ్స్ కాబిన్', 'ఏడుతరాలు' లాంటి నవలలు మన కళ్ళముందుంచాయి.

నేడు ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన దేశంగా చలామణిఅవుతున్న అమెరికా దేశం లోని మూలవాసులందర్నీ (వీరిని రెడ్ ఇండియన్లు అంటారు) చంపేయుటవెూ, తరిమేయటమో చేసిన యూరోపియన్ తెల్లజాతుల వారిలో, ఇంగ్లీషువారు ముఖ్యులు. మనదేశంపైన కొన సాగినవిధంగానే ఒకప్పుడు అమెరికాపై బ్రిటీషు ప్రత్యక్ష పెత్తనం వుండేది. అయితే 1776లో జార్జివాషింగ్టన్ తదితరుల నాయకత్వాన తిరుగుబాటు చేసి తమ స్వంత స్వతంత్ర రిపబ్లిక్‌ను ఏర్పరుచుకున్నారు. అయినా బానిసలు బానిసలే, నల్లవారిపై దోపిడీ, అణచివేతలు-క్రూరహింసాకాండ పాత పద్ధతుల్లోనే సాగి పోయాయి. 1860-64లలో అమెరికా 16వ అధ్యక్షుడుగా రెండుసార్లు ఎన్నికయిన అబ్రహాం లింకన్ బానిస వ్యాపారాన్ని, బానిసత్వాన్ని రద్దుపరుస్తూ చట్టం చేయటానికి ప్రయత్నించి నపుడు అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల తెల్లవారినుండి తీవ్ర వ్యతిరేకతతో సైనిక తిరుగుబాటు వచ్చింది. అయినా ఆ తిరుగుబాటును లింకన్ సైనిక బలంతోనే అణచివేసి 1863లో బానిసత్వాన్ని చట్టబద్ధంగా రద్దుపర్చాడు. బానిసలకు స్వేచ్ఛనిచ్చాడు. ఒక్కొక్క బానిస కుటుంబానికి వారి యజమానుల భూములలో 40 ఎకరాలు దఖలు పడేట్లు చేశాడు. అయితే రెండవసారి అధ్యక్షుడయిన కొద్దినెలలకే 1865లో ఆయనను శ్వేత జాత్యహంకారులు హత్యకావించారు. అమెరికా చరిత్రలో వారి దేశాధ్యక్షుడు హత్యకు గురవటం అదే మొదటి సంఘటన. సాంకేతికంగా-చట్టం ప్రకారం-బానిసత్వం లేకపోయినా, కొత్తరకపు నిరంకుశ చట్టాలతో (జిమ్‌క్రో) తెల్లవారు సంచరించే పాఠశాలలకు, రెస్టారెంట్లకు, పార్కులకు, వినోదశాలలకు, తదితర చోట్లకు నల్లవారి ప్రవేశాన్ని నిషేధించటం, ఆ చట్టాలతో వేధించటం, క్రూరంగా హింసించటం సాగుతూనే వుండేది.

వంద ఏళ్ళ తర్వాత మార్టిన్ లూథర్ కింగ్-2 నాయకత్వాన 1965లో మరొకమారు పెద్దఎత్తున జాతివివక్షకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు జరిగాయి. దానికి 'బ్లాక్ పాంథర్స్' ఉద్యమంగా పేరు వచ్చింది. నేటితో పోలిస్తే 55 ఏళ్ళ క్రితం జరిగిన హింసాకాండ చాలా పెద్దది. పోలీసు కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన వారు కూడా చాలా ఎక్కువ. అప్పటిదాకా నల్లవారికి ఎన్నికలలో పాల్గొనే హక్కు, వోటింగు హక్కులు లేవు. తర్వాత అవి లభించినప్పటికీ తెలుపు-నలుపు రంగుల వివక్ష కొనసాగుతూనే వుంది. దాని క్రూర రూపం పోలీసు వ్యవస్థ ద్వారా బహిర్గతమవటం రోజు వారీగా జరుగుతూనే వుంది. కొన్ని సందర్భాలలో స్థానికంగా తీవ్ర ఆందోళనగా మారుతున్న సందర్భాలు అనేకం వున్నాయి. వాటిలో 1991లో కాలిఫోర్నియాలో రోడ్నీకింగ్ అనే నల్లజాతీయుడిని తెల్లపోలీసులు దుర్మార్గంగా చంపి వేసిన దానికి వ్యతిరేకంగా లాస్‌ఏంజిల్స్ రాష్ట్రమంతా అట్టుడికి పోయిన సంఘటన ఒకటి.

**బానిసత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు ఉద్యమం:**

కారల్‌మార్క్స్ - ఫ్రెడరిక్ ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళిక రాయటానికి ముందే మార్క్స్‌రాసిన 'తత్వశాస్త్ర దారిద్ర్యం' అనే గ్రంథంలో అమెరికా దేశంలో సాగుతున్న నీగ్రోల బానిసత్వాన్ని, మనుషుల్ని జంతుప్రాయులుగా మార్చినదని పేర్కొన్నాడు. ఈ బానిసల శ్రమను కొల్లగొట్టటంపై అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ సంపన్నం కాగలుగుతోందని చెప్పాడు. అబ్రహాంలింకన్ సంకల్పించిన బానిసత్వ నిర్మూలనకు మద్దతునందిస్తూ యూరోపియన్ కార్మికవర్గం తరపున 1864లో తీర్మానం చేయించి పంపించాడు. అంతేకాకుండా లింకన్‌కు స్వయంగా కొన్ని ఉత్తరాలు కూడా రాశాడు. 'న్యూయార్క్ ట్రిబ్యూన్' పత్రికలో కారల్‌మార్క్స్ రాసిన వ్యాసాలకు అబ్రహాంలింకన్ పాఠకుడని చెప్పిన వారున్నారు.

మార్క్స్ రాసిన 'తత్వశాస్త్ర దారిద్ర్యం' పుస్తకానికి తర్వాత కాలంలో ఒక 'ఫుట్‌నోట్' యిస్తూ ఫ్రెడరిక్ ఏంగెల్స్-అమెరికాలో బానిసత్వ నిర్మూలనకు ఏర్పడిన ఆర్థిక - రాజకీయ అంశాలను ప్రస్తావించాడు. దక్షిణ అమెరికాలో ఎక్కువగా వుండే నల్లజాతి బానిసలకు ఎంతో ఒకింత స్వేచ్ఛనిస్తే తప్ప, వారు అమెరికా ఉత్తరప్రాంత బూర్జువాలకు సులభంగా, చౌకగా అందుబాటులోకి రారనేదే అసలు కారణమని ఏంగెల్స్ చెప్పాడు. అయినా అదొక ప్రాముఖ్యం గల అంశంగా చెప్పాడు.

లెనిన్ 1918లో 'అమెరికా కార్మికులకు' రాసిన లేఖలో "1863-1865 నాటి అమెరికన్ అంతర్యుద్ధంయొక్క అపారమైన, ప్రపంచ చారిత్రాత్మకమైన, ప్రగతిశీలమైన, విప్లవకరమైన ప్రాముఖ్యాన్ని నిరాకరించేవాడు యెంత ఛాందసుడు, ఎంత మతిహీనుడు!!'' అని రాశాడు. (యేరిన రచనలు - మూడవభాగం- పుట146) అప్పటికే లెనిన్-'రష్యన్లూ-నీగ్రోలు' అనే వ్యాసం 1913లో రాసి, అమెరికాలోని జాతి వివక్షనూ,బానిసత్వాన్ని 'అత్యంత క్రూరమైనది'గా పేర్కొన్నాడు. బానిసత్వానికి గుర్తులుగా నిరక్ష రాస్యతను లెనిన్ ఎత్తిచూపుతూ 1900 నాటికి అమెరికా నల్లవారిలో నూటికి 45 మంది నిరక్షరాస్యులుగా వుండటం దారుణమని, అనాగరికమని స్పష్టం చేశాడు. (ఈ లెనిన్ మాటలను మనదేశ పరిస్థితులను అన్వయించు కోవటం అవసరం)

ఇక 1928లో కామ్రేడ్ స్టాలిన్ మార్గదర్శకత్వాన వుండిన 3వ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ యొక్క ఆరవ మహాసభ రూపొందించిన పత్రం పేర్కొనదగిన ప్రాముఖ్యం గలది. 'వలస – అర్ధవలసలలో విప్లవోద్యమం' అన్న ఆ పత్రంలో 'నీగ్రో (ఆనాటికి అలాగే పిలిచేవారు) సమస్య' అన్న అంశంలో అమెరికాలోని నీగ్రో కమ్యూనిస్టులు తెల్లవారితో సహా మిగిలిన(రంగు) జాతుల కార్మికులను– రైతాంగాన్ని అమెరికా బూర్జువావర్గంపై పోరాడటానికి సన్నిహిత సంబంధాలను నెలకొల్పుకోవాలనీ మొత్తంగా నల్లవారిపై సాగుతున్న అనాగరిక దోపిడీ నుండి శాశ్వతంగా విముక్తి కావటానికి అదే ఏకైక మార్గమని చెప్పింది. అమెరికా దేశపు దక్షిణాది రాష్ట్రాలలో అత్యధికంగా వున్న నల్లవారికి 'స్వయం నిర్ణయాధికార హక్కు' డిమాండును కోరవచ్చునని కూడా సూచించింది.

కామ్రేడ్ మావో బ్లాక్ పాంథర్ల ఉద్యమం సాగుతుండగా (1968లో) ఈ సమస్యపై మాట్లాడుతూ ఆనాటికి 5 ఏళ్ళ క్రితం తాను చెప్పిన విషయాన్ని గుర్తుచేశాడు. "1963లో అమెరికా సామ్రాజ్యవాదుల జాతివివక్షా విధానానికి వ్యతిరేకంగా ఆఫ్రో – అమెరికన్లు కొనసాగిస్తున్న న్యాయబద్ధమైన పోరాటానికి మద్దతుగా నేను యిచ్చిన ప్రకటనను గుర్తు చేస్తున్నాను. నీగ్రోలతో వ్యాపారమూ, నీగ్రోలను బానిసలుగా చేయటం ద్వారా దుష్టవలస వాదమూ, సామ్రాజ్యవాదమూ పెరిగి పెద్దదయింది. అది నల్లజాతి ప్రజల సంపూర్ణ విముక్తి ద్వారా తప్పనిసరిగా అంతిమ దశకు చేరుకుంటుంది. ఇప్పటికీ నేను ఆ అభిప్రాయం తోనే వున్నాను". (16–4–1968)

**శ్వేత జాత్యహంకారంపై ప్రపంచవ్యాపిత ఆగ్రహం:**

ఇపుడు కరోనా భయంతో ప్రపంచమంతా లాక్‌డౌన్‌లో చిక్కుబడివున్నా శ్వేత జాత్యహం కారంపై, అమెరికాలోని నికృష్ట వర్ణవివక్షపై సామూహిక నిరసనలూ, ఆగ్రహజ్వాలలూ దేశ దేశాలలో పలు రూపాలలో వ్యక్తమయినాయి. ఆస్ట్రేలియాతో సహా సమస్త ఖండాలలో ప్రపంచ మంతా ప్రతిధ్వనించాయి. భారతదేశంలాంటివి తప్ప కొన్ని ప్రభుత్వాలు తీవ్రంగా అమెరికా తత్త్వాన్ని విమర్శించాయి. ఎద్దేవా చేశాయి. 54 ఆఫ్రికన్ దేశాల తరఫున 'జాతివివక్షపై' ఐక్యరాజ్యసమితి చర్చ జరపాలని కోరగా భద్రతా మండలి ఆమోదించింది.

అమెరికాలోని అనేక నగరాలలో తమ బానిసత్వానికి చారిత్రక మూలపురుషుడయిన నికోలస్ కొలంబస్‌లాంటి వారి విగ్రహాలపై నల్లజాతీయులు దాడులు చేశారు. అంతర్యుద్ధ కాలంనాటి(1860ల) శ్వేత జాత్యహంకారానికి ప్రతినిధులయిన జఫర్సన్ డేవిస్ విగ్రహాన్ని రిచ్‌మండ్ నగరంలో పడగొట్టారు. అంతేకాక మరొక పది విగ్రహాలను ధ్వంసం చేశారు. అలాంటివి ఇంకొక పది పైగా ఉన్నాయని ప్రకటించారు. సియాటిల్ నగరం ప్రాంతంలో శ్వేతజాతీయుల విగ్రహాలన్నీ విరగ్గొట్టారు. విశేషమేమంటే ఆ నగరంలోనే వున్న కామ్రేడ్ లెనిన్ విగ్రహం ఒక్కటే అత్యంత గౌరవనీయంగా నిలబడివుంది. ఇది లెనిన్ పట్ల సామాజిక సమానత్వానికై కమ్యూనిస్టు ఉద్యమానికుండే నిబద్ధతపట్ల ఆందోళనకారులకున్న విశ్వాసంగా మనం పరిగణించాలి.

బ్రిటన్ దేశంలోని బ్రిస్టల్ నగరంలో 17వ శతాబ్దానికి చెందిన బానిస వ్యాపారి ఎడ్వర్డ్ కోల్‌స్టన్ విగ్రహాన్ని విరగ్గొట్టి నీళ్ళలోకి తోసేశారు. అతనికి పాలకవర్గాలు 'ధార్మికుడ'నే బిరుదుని ప్రసాదించివున్నా లెక్క చేయలేదు. అలాగే రెండవ ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటీషు ప్రధానిగా వుండిన, చాలా పెద్ద మేధావిగా హాస్యచతురత గలవాడుగా పేరుపొందిన విన్‌స్టన్ చర్చిల్ విగ్రహాన్ని కూడా పడదోశారు. దానికి కారణం భారత దేశంలో బెంగాల్ రాష్ట్రంలో 30 లక్షలమంది కరువువాతనపడి బలవటానికి అతడే కారకుడని ఆరోపించారు. అయితే బ్రిటను దేశంలో సమానత్వ వ్యతిరేకవాదులు కూడా బజారులోకొచ్చి ప్రదర్శనలు చేయటం విశేషం. ఒకనాటి బ్రిటీషు వలసవాదులు ప్రపంచ వ్యాపితంగా ప్రదర్శించిన జాత్యహంకార వివక్షత, దోపిడీ, పీడనల చరిత్రనంతా ప్రశ్నార్థకం చేస్తుండటాన్ని భరించలేని, సహించలేనివారే, ఆధిపత్యం కొనసాగాలని కోరు కుంటున్నవారే ఈ చర్యలకు పూనుకుంటున్నారని మనం అర్థంచేసుకోవాలి. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని శ్వేత జాత్యహంకారులకు వ్యతిరేకంగా అక్కడి మూలవాసులు అనేక నగరాలలో వారాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పెర్త్, డార్విన్, క్వీన్‌లాండ్ తదితరచోట్ల అవి జరిగాయి. "నల్లవారివీ ప్రాణాలే!!" అనే నినాదంతో అమెరికానుండి ఆస్ట్రేలియా దాకా సాగుతున్న ఈ ఉద్యమంలో –పోలీసు కస్టడీలో మరణించిన 400 మంది ఆస్ట్రేలియన్ మూలవాసుల మరణంపై ఆందోళన వ్యక్తం చేశారు. కెనడా దేశంలోనూ, లాటిన్ అమెరికా ఖండంలోనూ, ఐరోపా, ఆఫ్రికా, ఆసియా దేశాలలోనూ వర్ణవివక్షకూ, శ్వేతజాత్యహంకారానికీ, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా 'ఐ కాన్ట్ బ్రీత్' నినాదంగా పలు రూపాలలో ఈ ప్రదర్శనలు జరిగాయి. భారతదేశంలో తరతరాలుగా అమలులో వున్న నిచ్చెనమెట్ల వర్ణ, కులవ్యవస్థ, అస్పృశ్యతలను నల్లజాతి వివక్షతో పోల్చి–అంతం కావాలనే ప్రచారం సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా సాగుతూ వుంది. మనదేశంలో దళితులపై, మైనారిటీలపై సాగుతున్న పాలక మతోన్మాద శక్తుల దాడులు, అమెరికాలో శ్వేతజాత్యహంకారుల దాడుల తరహాలో జరుగుతున్న మాట వాస్తవం.

**తెలుపు–నలుపు శ్రామిక– ప్రజాతంత్ర శక్తుల ఐక్యత చాటిన ఉద్యమం:**

మార్టిన్ లూథర్‌కింగ్–2 నాయకత్వాన 55 సంవత్సరాల క్రితం జరిగిన 'బ్లాక్ పాంథర్స్' ఉద్యమం ప్రధానంగా నల్లవారు మాత్రమే పాల్గొన్నదిగా వుంది. అయితే నేటి ఉద్యమంలో నల్లవారితోపాటు తెల్లవారు కూడా విస్తారంగా పాల్గొనటం గమనించవలసిన ముఖ్యాంశం. వారిలో ప్రధానంగా శ్రామికవర్గాల, ప్రజాతంత్ర, వామపక్ష ఉద్యమకారులు నల్లవారితో భుజం భుజం కలిపి నిలవటం ముఖ్య పరిణామం. అందుకుగల

ఒక కారణంగా గడిచిన రెండు దశాబ్దాలుగా ఆర్థిక అసమానతలు అమెరికా లోనూ, ప్రపంచమంతా విపరీతంగా పెరిగి పోవటం పేర్కొనదగింది. మరొకవైపున సామాజిక సమానత్వ ఆకాంక్షలు పెరుగుతున్న స్థితి. ఆఖరికి ఇటీవలి కరోనా వ్యాధి పీడితులలో-అన్ని చోట్లలాగే-అమెరికాలో కూడా ఎక్కువమంది శ్రామికవర్గ పేదలు అత్యధికంగా గురయ్యారు. అత్యంత సహజంగా భారతదేశం లాంటి చోట్ల ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు బడుగుబలహీన వర్గాల వారిలాగే అమెరికాలో నల్లవారు ఎక్కువమంది కరోనా పీడితులయ్యారు. అందునా ట్రంపు ప్రభుత్వం కరోనాను అరికట్టలేక లక్షమందికి పైగా-ప్రపంచంలోనే అత్యధికంగా- అమెరికన్లు బలవటానికి కారణమయింది. అలాగే కరోనావల్ల ఉపాధి కోల్పోయినవారు, నివాసాలను ఖాళీచేయవలసిన వారూ శ్రామిక జనావళే అయి వున్నారు. అందునా శ్రామిక వర్గాలలో తెలుపు - నలుపువారికన్నా, మధ్య తరగతి ఇంకా ఆ పై శ్రేణులలోని తెలుపు- నలుపు, వారి నడుమ అసమానతలు వేగంగా పెరుగుతున్నాయి. ఇవన్నీ ఒకవైపు పెట్టుబడిదారీ విధానపు వైఫల్యాలను సూచిస్తుంటే, మరొకవైపు శ్రామిక ప్రజలు ఐక్యం కావాల్సిన ఆవశ్యకతను నేర్పుతున్నాయి. ఇవన్నీ కలగలిసి గతంలో ఎన్నడూలేని విధంగా తెలుపు-నలుపు శ్రామిక జనావళిని, ప్రజాతంత్రవాదులను దగ్గరకు తెచ్చాయని అర్థమవుతోంది. అయితే ఈ సంవత్సరం చివర జరగనున్న ఆ దేశాధ్యక్ష ఎన్నికలలో ట్రంపును ఓడించాలన్న శక్తుల తోడ్పాటు కూడా యిందులో వున్నదనే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఈ సందర్భంగా జార్జిఫ్లాయిడ్ హత్య జరిగిన రెండవ రోజునే కేనన్ రీడ్ రాసిన వాక్యాలు గమనించదగినవి.

"పోలీసు క్రౌర్యానికి వ్యతిరేకంగా సాగుతున్న నేటి పోరాటానికి ఒక రాజకీయ వ్యూహం అవసరం. అది మొత్తం శ్రామికవర్గాన్ని ప్రజలందరి ప్రజాతంత్ర హక్కుల రక్షణకోసం సంఘటితం చేయాలి. అది పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సోషలిజంకోసం జరిపే పోరాటమయి వుండాలి". (27-5-2020)

అమెరికాలో వర్ణవివక్షకూ, శ్వేతజాత్య హంకారానికీ వ్యతిరేకంగా పెల్లుబికిన పోరాటం దీర్ఘకాలం సాగకపోవచ్చుగాక! కానీ అది ఇటీవలి కాలపు శ్రామికవర్గ ఉద్యమాలలో, దోపిడీ- పీడనలకు అణచివేతలకు జాతివివక్షకూ వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో చాలా ప్రాముఖ్యం కలది. దాని పరిమితులతోపాటు అది అందించే విలువైన పాఠాలను కూడా అందిపుచ్చుకోవలసినది.

అమెరికాలోని జాతివివక్ష అన్నది పెట్టుబడిదారీ దోపిడీని కొనసాగించటానికి, తీవ్రతరం గావించటానికి చేసుకున్న వ్యూహాత్మక సాంఘిక ఏర్పాటు. దాన్ని రాజకీయంగా నల్లవారి అణచివేతలతో శ్రామికవర్గాల నడుమ చీలికలద్వారా కొనసాగిస్తున్నారు. మార్క్స్ అన్నట్లు అది పాతయుగాల నిరంకుశ అణచివేత విధానాలూ, ఆధునిక శ్రమదోపిడీతో కలగలిసి వుంది. భారత సమాజానికి కూడా అలాంటి లక్షణాలేవున్నట్లు కనబడుతున్నా మనది పాత యుగాల ఫ్యూడల్ దోపిడీకి పుట్టిన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ, దాని నికృష్ట అణచివేతలూనని గమనంలో వుంచుకోవాలి.

ఈ సందర్భంగా బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవవీరుడు 'స్పార్టకస్' నవలలోని చివరి వాక్యాలు గుర్తుచేసుకుందాం.

**"సమాజంలో చాలామంది తమ శ్రమశక్తిని ధారపోసి సృష్టించిన సంపదనంతనూ యేకొద్ది మందో భుక్తం చేసుకుని మానవజాతిని దోపిడీ చేసినంత కాలమూ, ఈ స్పార్టకస్ పేరు జ్ఞాపకముంటూనే వుంటుంది! ప్రతిధ్వనిస్తూనే వుంటుంది!**

**భయంవల్లో శక్తిహీనతవల్లో ఒక్కొక్కప్పుడా పేరు గుసగుసలలోనే వుండిపోవచ్చు. కానీ, అదే పేరు మరొకప్పుడు రణన్నినాదమై దిక్కులు పిక్కటిల్లేటట్లూ, కువలయం కంపించేటట్లూ ప్రతిధ్వనించవచ్చు!!"**

ooo